వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 309 మంగళవారం | 25 జూన్ 2024 | పేజీలు : 08 | వెల రూ. 5




## 28న సీఎం రేవంత్ పర్యటన

### నగరాభివృద్ధిపై అధికారులతో సమీక్ష

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 28న వరంగల్ నగరంలో పర్యటించనున్నారు. నగరం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో ఆయన పర్యటన ప్రాధాన్యం చేకూరింది. కూడా పరిధిలో చేపట్టబోయే అండర్ డ్రైనేజీ పనులతో పాటు ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ప్రజాప్రతినిధులతో పాటు అధికారులతో ఉదయం నుంచి సాయంత్రం వరకు హనుమకొండ కలెక్టరేట్ లో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా చేపట్టాల్సిన పనులు, కావాల్సిన నిధులపై ఆయన చర్చించనున్నారు. అదే విధంగా 300 పడకలతో జర్మన్ వైద్య బృందంతో హంటర్ రోడ్డులో నాలుగు అంతస్తుల్లో అధునాతనంగా నిర్మించిన మెడికవర్ ఆసుపత్రిని సీఎం లాంఛనంగా ప్రారంభించనున్నారు. కాగా ముఖ్యమంత్రి రాకకోసం నగరాన్ని ముస్తాబు చేస్తున్నారు. - వరంగల్ వాయిస్, వరంగల్

# కాంగ్రెస్‌లో.. చేరికల చిచ్చు



### పార్టీ బలోపేతానికా.. సీనియర్లకు చెక్ పెట్టేందుకా ?

కాంగ్రెస్ పార్టీలో చేరికలు చిచ్చుపెడుతున్నాయి. పాంచ్ న్యాయ్‌కు తూట్లు పొడవడంపై మండిపడుతున్నారు. పదేళ్లపాటు ప్రతిపక్షానికి పరిమితమైన కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలను ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్లు తాగించిన వారికి నేడు రెడ్ కార్పెట్ పరిచి పార్టీలోకి ఆహ్వానించడాన్ని పార్టీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో ఎంతో మంది కాంగ్రెస్ పార్టీకి చెందిన సిన్సియర్ నాయకులపై తప్పడు కేసులు పెట్టి పోలీస్ స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిప్పిన ఎమ్మెల్యేలు, వారి అనుచరుల ఇంటికి వెళ్లి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించడం కార్యకర్తలను ఆందోళనకు గురి చేస్తోంది. చేరికలపై ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి తిరుగుబావుటా ఎగురవేశారు. ఎమ్మెల్యే పార్టీ మారితే సభ్యత్వం రద్దు చేస్తామని కాంగ్రెస్ మానిఫెస్టోలో పెట్టి, ఇప్పుడు పార్టీలో ఎలా చేర్చుకుంటారంటూ ప్రశ్నిస్తున్నారు. దీంతో దిగివచ్చిన అధిష్ఠానం బుజ్జగింపులు ప్రారంభించింది. అయితే పార్టీనే నమ్ముకున్న కింది స్థాయి నాయకులు, కార్యకర్తలు మాత్రం చేరికలపై తిరుగుబాటు చేయలేక పార్టీలో ఇముడలేక సతమతవుతున్నారు. దాచి దాచి దయ్యాలపాలు చేసినట్లు కాంగ్రెస్ పరిస్థితి అయ్యిందంటూ మదనపడుతున్నారు. అయితే ఇది కాంగ్రెస్ పార్టీ బలోపేతానికా లేక సీనియర్లకు చెక్ పెట్టేందుకు రేవంత్ ఆడుతున్న నాటకమా అన్న చర్చ పార్టీలో కొనసాగుతోంది.
- వరంగల్ వాయిస్, వరంగల్


వివరాలు 2లో..

మేనిఫెస్టోకు తూట్లు అంటూ విమర్శ

బీఆర్ఎస్‌ను కనుమరుగు చేయడమే లక్ష్యంగా అడుగులు

ప్రాభవం కోల్పోతున్న సిన్సియర్ నేతలు

ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి తిరుగుబావుటా





2 లో..

## డాక్టర్ కడియం కావ్య అను నేను..

ఎంపీగా ప్రమాణ స్వీకారం

మల్లికార్జున ఖర్గే, కొప్పుల రాజుతో మిలాఖత్



8 లో..

## గ్రాండ్ మాస్టర్ అర్జున్‌కు సన్మానం

హనుమకొండ వాసి కావడం గర్వకారణం

ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి




8లో..

## విధుల్లో అలసత్వం వద్దు

అదనపు డీసీపీ సురేష్ కుమార్




# కాంగ్రెస్‌లో.. చేరికల చిచ్చు

**పార్టీ బలోపేతానికా.. సీనియర్లకు చెక్ పెట్టేందుకా?**

**మేనిఫెస్టోకు తూట్లు అంటూ విమర్శ**

**బీఆర్ఎస్‌ను కనుమరుగు చేయడమే లక్ష్యంగా అడుగులు**

**ప్రాభవం కోల్పోతున్న సిన్సియర్ నేతలు**

**ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి తిరుగుబావుటా**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** పదేళ్లు ప్రతిపక్షానికే పరిమితమైన కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు పాటు పడిన నాయకులు, కార్యకర్తలను కాదని చేరికలను ప్రోత్సహించేంది లేదరి, పార్టీ ఫిరాయింపులకు ఎవరైనా పాల్పడితే రాళ్లతో కొట్టి చంపాలంటూ అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేడు దానికి తిలోదకాలు పలికి బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలకు ఎర్ర తివాచి పరచడం పార్టీలో చర్చనీయాశంగా మారింది. పది సంవత్సరాల తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ పాలనపై దృష్టి సారించకుండా చేరికలను ప్రోత్సహించడంపై పార్టీ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొత్తవారిని చేర్చుకోవాల్సిన అవసరం కాంగ్రెస్ పార్టీకి లేకున్నా చేరికలను ప్రోత్సహిస్తూ కాంగ్రెస్ పార్టీకి అధికారం అందించిన నాయకులు, కార్యకర్తలను విస్మరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చేరికలతో కాంగ్రెస్ పార్టీ ఓవర్ లోడ్ అయ్యే ప్రమాదం ఉన్నా అవేమీ పట్టించుకోకుండా కొత్త వారిని పార్టీలోకి ఆహ్వానించడం ఆందోళన కలిగిస్తోందంటున్నారు.

### పార్టీ బలోపేతానికేనా..

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఇంటికే వెళ్లి వారిని పార్టీలోకి చేర్చుకోవడం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఎమ్మెల్యేలతోపాటు వారి అనుచరులకు కూడా సీఎం స్వయంగా కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పుతున్నారు. అయితే ఇదంతా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి చేస్తున్నదా లేక సీనియర్లకు చెక్ పెట్టేందుకు రేవంత్ రెడ్డి ఆడుతున్న నాటకమా అన్న చర్చ రాష్ట్ర వ్యాప్తంగా సాగుతోంది. బీఆర్ఎస్ పార్టీని కనుమరుగు చేయాలన్న ఏకైక లక్ష్యంతో ఇంత సాహసం అవసరమా అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

### కంటతడి పెట్టిన జీవన్ రెడ్డి..



ఇటీవల పోచారం శ్రీనివాస్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవడాన్ని ఆ పార్టీ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి తీవ్రంగా వ్యతిరేకించారు. అయినా అధిష్ఠానం ఇవేమీ పట్టించుకోలేదు. ఇదిలా ఉండగా జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ ని కూడా కాంగ్రెస్ పార్టీలోకి తీసుకోవడాన్ని జీవన్ రెడ్డి తీవ్రంగా వ్యతిరేకించారు. చిరకాల ప్రత్యర్థి అయిన సంజయ్ కి పార్టీలోకి తీసుకోవడాన్ని తట్టుకోలేక జీవన్ రెడ్డి కంటతడి పెట్టారు. అవసరమైతే పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసేందుకు సిద్ధపడ్డారు. దీంతో జగిత్యాల జిల్లాలో కాంగ్రెస్ నాయకులు భగ్గుమంటున్నారు. విషయం తెలుసుకున్న పార్టీ అధిష్ఠానం బుజ్జగింపులకు దిగింది. శాసన సభ ఎన్నికలకు ముందు స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీ చేరేందుకు సిద్ధపడగా స్థానిక నేతలు తీవ్రంగా వ్యతిరేకించారు. ఆయన రాకను అడ్డుకున్నారు. అధిష్ఠానం సైతం కార్యకర్తల మనోభావాలను గుర్తించి రాజయ్యను పార్టీలో చేర్చుకోలేదు. కాని ఇప్పుడు మాత్రం కార్యకర్తల అభీష్ఠం అటకెక్కింది. ఎమ్మెల్యే అయితే చాలు గతంలో ఏం చేశాడన్నది పక్కన బెట్టి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పడం వివాదాస్పదంగా మారుతోంది.



## డాక్టర్ కడియం కావ్య అను నేను..

**ఎంపీగా ప్రమాణ స్వీకారం**

**మల్లికార్జున ఖర్గే, కొప్పుల రాజుతో మిలాఖత్**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** పార్లమెంట్ సభ్యురాలిగా డాక్టర్ కడియం కావ్య మంగళవారం లోక్ సభలో ప్రమాణ స్వీకారం చేశారు. డాక్టర్ కడియం కావ్య అను నేను.. అంటూ తెలుగులోనే తన ప్రమాణ స్వీకారాన్ని కొనసాగించారు. మహబూబాబాద్ ఎంపి బలరాం నాయక్ కూడా తెలుగులోనే ప్రమాణ స్వీకారం చేశారు. పార్లమెంట్ సభ్యురాలిగా ఢిల్లీలో అడుగుపెట్టిన డాక్టర్ కడియం కావ్య తొలుత ఏఐసీసీ కార్యాలయంలో అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరితో కలిసి మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. పార్లమెంట్ లో ఎంపీగా ప్రమాణస్వీకారం చెయనున్న సందర్భంగా ఆయన ఆశీర్వాదలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్యకు మల్లికార్జున ఖర్గే శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఢిల్లీలో ఏఐసీసీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ జాతీయ కోఆర్డినేటర్ కొప్పుల రాజుని మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కడియం కావ్యకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

## గ్రాండ్ మాస్టర్ అర్జున్‌కు సన్మానం

**ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఇండియా నెంబర్ వన్, గరిష్టంగా 2,778 రేటింగ్‌ను సాధించి ప్రపంచంలోని టాప్ 4 లోకి ప్రవేశించిన హనుమకొండ జిల్లాకు చెందిన అంతర్జాతీయ చెస్ గ్రాండ్‌మాస్టర్ ఇ.అర్జున్ ను మంగళవారం కుడా కార్యాలయంలో వరంగల్ పశ్చిమ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, మేయర్ గుండు సుధా రాణి, హన్మకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలకమండలి సభ్యులు ఈవీ శ్రీనివాస్ రావు శాలువాతో సన్మానించి మెమోంటో బహుకరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వరంగల్ పశ్చిమ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. జ్యోతి- డాక్టర్ ఇ.శ్రీనివాస్ రావు తనయుడు ఇ.అర్జున్ (20) ఏడు సంవత్సరాల వయస్సులోనే తన చదరంగం ప్రయాణాన్ని ప్రారంభించి, ఆశ్చర్యకరమైన వేగంతో ర్యాంక్‌లను అధిరోహించి గరిష్టంగా 2,778 రేటింగ్‌ను సాధించి ప్రపంచంలోని టాప్ 4 లోకి ప్రవేశించిన అర్జున్ ను సత్కరించే అద్భుతమైన గౌరవం మాకు లభించడం సంతోషంగా ఉందన్నారు. అద్భుత ఆట తీరుతో ప్రతిభ కనబరచి టైటిల్ సొంతం చేసుకోవడం అది మన హనుమకొండ జిల్లాకు చెందిన క్రీడాకారుడు కావడం గర్వంగా ఉందన్నారు. క్రీడాకారులను ఆదుకుంటామని, వారికీ అండగా నిలుస్తామని, వారి అభ్యున్నతికి తాము అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

# అంగన్ వాడీ టీచర్లకు శిక్షణ

**పూర్వ ప్రాథమిక విద్య కేంద్రాలుగా అభివృద్ధి**

**రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** పూర్వ ప్రాథమిక విద్య కేంద్రాలుగా అంగన్ వాడీలను అభివృద్ధి చేయాలని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి వాకాటి కరుణ సూచించారు. మంగళవారం రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి వాకాటి కరుణ అంగన్ వాడీ కేంద్రాల అభివృద్ధిపై రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా, అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, జిల్లా సంక్షేమ అధికారి హైమావతిలతో కలిసి పాల్గొన్నారు. పూర్వ ప్రాథమిక విద్య కేంద్రాలుగా అంగన్ వాడీ సెంటర్ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ప్రణాళికలను, జిల్లా స్థాయిలో చేపట్టాల్సిన చర్యలు, పిల్లలలో పోషక లోపం నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, తదితర అంశాలను రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి వాకాటి కరుణ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి వాకాటి కరుణ మాట్లాడుతూ, అంగన్ వాడీ సెంటర్లలో పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్య అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అంగన్ వాడీ పూర్వ ప్రాథమిక విద్యా కేంద్రాల ఏర్పాటుకు నిర్ణయం తీసుకుందని అన్నారు. గత 5 నుంచి 6 సంవత్సరాలుగా పిల్లల సంక్షేమం కోసం కృషిచేసిన ప్రముఖమైన స్వచ్ఛంద సంస్థల సహకారంతో అంగన్ వాడీ సెంటర్ల అభివృద్ధి కార్యాచరణ, పిల్లలకు నేర్పాల్సిన పాఠ్యాంశాలు, పిల్లల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యల ప్రణాళిక రూపొందించామని అన్నారు. జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలను దృష్టిలో ఉంచుకొని చిన్న వయసులో పిల్లలకు నేర్పాల్సిన వ్యక్తిగత పరిశుభ్రత, అంశాలు, నైపుణ్యాలతో కోర్సు సిద్ధం చేశామని, అంగన్ వాడీ సెంటర్లలో పిల్లలకు నేర్పించాల్సిన అంశాలను వివరిస్తూ అంగన్ వాడీ టీచర్లకు ప్రత్యేక బుక్ లెట్ రూపొందించామని, జూలై మొదటి వారం నాటికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అంగన్ వాడీ టీచర్లకు పూర్వ ప్రాథమిక విద్యపై శిక్షణ పూర్తి చేయాలని కలెక్టర్ లకు ఆమె సూచించారు. జిల్లా స్థాయిలో జరుగుతున్న అంగన్ వాడీ శిక్షణ కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా పర్యవేక్షించాలని, అంగన్ వాడీ కేంద్రాలలో ఉన్న పిల్లలకు ఏక రూప దుస్తులు అందించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. జూలై నెలలో అంగన్ వాడీ పూర్వ ప్రాథమిక విద్య కేంద్రాలను ప్రారంభించడం జరుగుతుందని, అప్పటి వరకు నిర్దేశించిన పనులు పూర్తి చేయాలని అన్నారు. చిన్నపిల్లల్లో పోషక లోపాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, ముందస్తుగా పోషక లోపం గల పిల్లలను అంగన్ వాడీ టీచర్ల ద్వారా గుర్తించాలని అన్నారు. అంగన్ వాడీ కేంద్రాలలో ఉన్న పిల్లల ఎదుగుదల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, వయసుకు తగిన బరువు ఎత్తు లేని పిల్లలను గుర్తించాలని, పిల్లలలో ఉన్న ఎదుగుదల, మానసిక సమస్యలను ముందస్తుగా గుర్తిస్తే




వాటిని త్వరితగతిన పరిష్కరించె అవకాశం ఉంటుందని అన్నారు. శారీరక, మానసిక వైకల్యం ఉన్న పిల్లలకు దివ్యాంగ సర్టిఫికెట్ త్వరితగతిన అందించేందుకు సదరం క్యాంపులలో అవసరమైన మేర స్లాట్ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు.

అనంతరం కలెక్టర్ సత్య శారదా మాట్లాడుతూ..జిల్లాలోని అంగన్ వాడీ కేంద్రాలలో మంజూరైన సివిల్ వర్క్స్, పెండింగ్ వర్క్స్, ప్రతి అంగన్ వాడీ కేంద్రంలో త్రాగు నీరు, అవసరమైన మేర టాయిలెట్ల నిర్మాణం, విద్యుత్ మరమ్మత్తు మొదలగు పనుల పై పూర్తి నివేదికలు రెండు రోజుల్లో సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# త్వరితగతిన చిన్న కాళేశ్వరం పనులు

## కలెక్టర్ రాహుల్ శర్మ



**వరంగల్ వాయిస్, కాటారం :** చిన్న కాళేశ్వరం పంప్ హౌస్ మరమ్మత్తు పనులను పూర్తి చేయాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మహదేవ్ పూర్, కాటారం మండలాలలో సుడిగాలి పర్యటన నిర్వహించారు. మొదటగా కాళేశ్వర ముక్తేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో జిల్లా కలెక్టర్ కు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి శేష వస్త్రాలతో సన్మానించారు. అనంతరం గోదావరి, తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న వంతెనను పరిశీలించారు. బీరసాగర వద్ద జరుగుతున్న చిన్న కాళేశ్వరం పంప్ హౌస్ మరమ్మతు పనులను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మూడు పంప్ హౌస్ లు ఏర్పాటు చేయాల్సి ఉండగా రెండు పూర్తయ్యాయని, ఒకటి వచ్చే నెలలో పూర్తి చేయాలని ఆదేశించారు. మరమ్మతు పనులతో పాటు ప్రత్యామ్నాయంగా విద్యుత్ సరఫరా పురుద్దరణ పనులు చేపట్టాలని సూచించారు.చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా ఎర్ర చెరువు, మందిరం చెరువు, కొత్త చెరువు పరిధిలోని దాదాపు 10 వేల అదనపు ఆయకట్టుకు సాగు నీరు అందించనున్నట్లు తెలిపారు. ఎర్ర చెరువు, మందిరం చెరువులను పరిశీలించి చెరువు అభివృద్ధి పనుల పురోగతిని తెలుసుకున్నారు.కాటారం మండలం గారేపల్లి వద్ద కాళేశ్వరం రెండో దశ ఎత్తిపోతల పథకం పనులను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పరిశీలించారు. చిన్న కాళేశ్వరం పంప్ హౌస్ ద్వారా మహాదేవపూర్, కాటారం, మహా ముత్తారం, పలిమెల మండలాలలో దాదాపు 45వేల ఎకరాలకు అదనంగా సాగునీరు అందించేందుకు అవకాశం ఉన్నట్లు చెప్పారు. గారెపల్లి పంప్ హౌస్ 2 నుండి 13 చెరువులకు నీటిని అందించనున్నట్లు తెలిపారు. ఈ సంవత్సరం పంటలకు సాగు నీరు అందించాలన్న ప్రభుత్వ లక్ష్యం మేరకు పనులు జరుగుతున్నాయని తెలిపారు. చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా దాదాపు 63 గ్రామాల రైతుల పంట పొలాలలకు సాగునీరు అందుతుందన్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ, అవసరమైన నిధులు కొరకు ప్రతిపాదనలు అందచేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. నీళ్లు వస్తే రైతులు సాగు చేయడానికి ధైర్యం వస్తుందని జాప్యానికి తావు లేకుండా నిరంతరాయంగా పనులు జరగాలని ఆయన పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ ఈఈలు యాదగిరి, తిరుపతిరావు, మహాదేవపూర్ డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ, కాటారం తహసీల్దార్ నాగరాజు, ఇరిగేషన్ ఏఈ విజయ్‌కుమార్, మెగా ప్రాజెక్టు సీనియర్ ప్రాజెక్టు మేనేజర్‌పాషా పాల్గొన్నారు.

## పాఠశాల అభివృద్ధికి ఎన్నారై విరాళం



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధి కోసం 1993-94 బ్యాచ్ పూర్వ విద్యార్థులు అభ్యర్థన మేరకు ఒక ఎన్నారై ముందుకు వచ్చి లక్ష రూపాయలు విరాళం అందజేశారు. మంగళవారం వరంగల్ ఉర్సులోని శ్రీ వెంకటేశ్వర ఉన్నత పాఠశాల ఎయిడెడ్ కు ఎన్నారై కెంచ నవీన్ కుమార్-హాసినిలు పంపించిన లక్ష రూపాయల చెక్ ను వారి తల్లిదండ్రులు కెంచ కుమారస్వామి-లక్ష్మిలు పాఠశాల యాజమాన్యానికి అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సోమశేఖర్, పాఠశాల సెక్రటరీ యేరా కోటేశ్వరరావు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి విరాళం ఇచ్చిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు ముందుకు రావాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థి వనం శ్రీకాంత్, వి.సత్యనారాయణ, పాఠశాల సిబ్బంది ఎండీ.దావూద్, ఆర్.అశోక్, ఎం.తిరుపతిరెడ్డి, విద్యార్థిని విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర క్రీడా స్కూల్‌కు కురవి విద్యార్థుల ఎంపిక



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** తెలంగాణ రాష్ట్ర క్రీడా పాఠశాలలలో 4వ తరగతిలో విద్యార్థుల ప్రవేశానికి కురవి మండల స్థాయిలో విద్యార్థుల ఎంపీక మంగళవారం జరిగిందని కురవి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎండీ వహీద్ తెలిపారు. 30 మంది విద్యార్థులు పోటీలొ పాల్గొనగా ఇందులో నుంచి చేగువేరా, అమృత, మంజుల, మేఘ మాల, కార్తీక్, అశ్విత్, గాంధర్విక ఏడుగురిని జిల్లా స్థాయికి ఎంపిక చేయడం జరిగిందని ఆయన తెలిపారు. పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ రాగం వీరభద్రం, వివిధ పాఠశాలల పీడీలు ప్రేమ్ కుమార్, కాశీనాథ్, సునీల్, కమల్ కిషోర్, భారతి తదితరులు పాల్గొన్నారు.

## అంగవైకల్యులను ఆదరించండి



**వరంగల్ వాయిస్, నెల్లికుదురు :** పూర్తి అంగవైకల్యం ఉన్నా పెన్షన్ జాడే లేదని, నిలువ నీడ కూడా లేదని, తన కుటుంబాన్ని ఆదుకోవాలని కోటగిరి సతీష్ కలెక్టర్ ను వేడుకున్నారు. వివరాల్లోకి వెళితే మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం మేచరాజుపల్లి గ్రామానికి చెందిన కల్లు గీత కార్మికుడు కోటగిరి సతీష్ నాలుగు సంవత్సరాల క్రితం వృత్తిలో భాగంగా తాటి చెట్టు ఎక్కి దిగుతూ ప్రమాదవశాత్తు కిందపడి తన వెన్నముక విరిగి పలు అస్పత్రుల్లో చికిత్స తీసుకొని లక్షలాది రూపాయలు అప్పులు చేసి వైద్యానికి ఖర్చు చేసినా మాములు స్థితికి రాలేక మంచానికే పరిమితం అయ్యాడు. ప్రభుత్వ వైద్యుల ద్వారా సదరం క్యాంపులో పరీక్షలు చేయించుకోగా డెబ్బై అయిదు శాతం అంగవైకల్యం నమోదు చేసి డాక్టర్లు ధ్రువీకరణ పత్రం ఇచ్చినా ఇప్పటివరకు పింఛన్ అందక, ఉండటానికి ఇల్లులేక, భార్య కుమార్తెతో బిక్కుబిక్కుమంటూ చిన్న పూరిగుడిసెలో కాలం వెళ్లదీస్తున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై జిల్లా కలెక్టరెట్ లో ప్రజావాణిలో కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్‌కు తన కష్టాలపై వినతిపత్రం సమర్పించి ప్రభుత్వం తరపున తనను ఆదుకోవాలని కోరారు.

## అవయవ దాతకు ఘన సన్మానం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రపంచ అవయవదాన మార్పిడి దినోత్సవం సందర్భంగా అవయవ దాతకు డాక్టర్.ఏ.రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. రామన్నపేటలోని డాక్టర్.ఏ.రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మట్టేవాడ బొమ్మల గుడి దగ్గర నివాసం ఉంటున్న శామంతుల విజయ తన కొడుకైన రాజేందర్ కు ఒక కిడ్నీ దానం చేశారు. ఈ సందర్భంగా సామంతుల విజయకు ట్రస్టుచే ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మేనేజింగ్ ట్రస్టీ మాట్లాడుతూ ప్రతి మనిషికి రెండు కిడ్నీలు ఉంటాయి. అందులో ఒకటి దానం చేసినా ఇంకొక కిడ్నీతో జీవించ వచ్చు అవయవ దానం చేయడం వల్ల అవయ దానం చేసిన వ్యక్తి, అవయదానం పొందిన వ్యక్తి ఇద్దరు సురక్షితంగా ఆరోగ్యంగా ఉన్నారు. దీన్ని స్ఫూర్తిగా తీసుకొని అవయదానంపై ఉన్న అపోహలను తొలగించుకొని యువత ముందుకు రావాలన్నారు. జీవం ఉండగా రక్తదానం, కొంత భాగం కాలేయం, ఒక కిడ్నీ దానం, తల వెంట్రుకలు దానం చేయవచ్చన్నారు. మరణానంతరం మాత్రమే నేత్ర, అవయవ, శరీర దానం చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్ శ్రవణ్, కోఆర్డినేటర్ మోహన్ వారణాసి, మిట్టపల్లి సమ్మయ్య, నరేంద్ర చారి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## నిషేధిత గుట్కాలు విక్రయిస్తే కఠిన చర్యలు

### వెంకటాపూర్ ఎస్ఐ జక్కుల సతీష్



**వరంగల్ వాయిస్, వెంకటాపూర్ :** ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలో నిషేధిత గుట్కాల అమ్మకాలపై పోలీసులు ఉక్కు పాదం మోపుతున్నారు. జిల్లా ఎస్పీ శబరీష్ ఆదేశాల మేరకు సోమవారం రాత్రి వెంకటాపూర్ ఎస్ఐ జక్కుల సతీష్ అధ్యర్యంలో పోలీసులు మండలంలోని పలు గ్రామాల్లోని వివిధ షాపుల్లో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో నల్లగుంట గ్రామంలోని రఘు కిరాణంలో సుమారు రూ.2వేల విలువ చేసే నిషేధిత గుట్కాలు లభ్యమయ్యాయి. దీంతో ఎస్ఐ సతీష్ గుట్కాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు షాప్ యజమాని రఘుపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ జక్కుల సతీష్ మాట్లాడుతూ గ్రామాల్లో గుట్కాలు అమ్మడం, కొనటం చట్టరీత్యా నేరమని అన్నారు. చట్ట వ్యతిరేకంగా గుట్కాలు అమ్మిన, కొన్న వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోక తప్పద్దని హెచ్చరించారు. గ్రామాల్లో ఎవరైనా గుట్కాలు అమ్ముతున్నారని తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచటం జరుగుతుందని తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ సతీష్ తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పేదలకు అందని ద్రాక్షగా మారిన విద్య

## ఘనంగా ఏఐఎస్‌బీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** అఖిల భారత విద్యార్థి బ్లాక్ ఏఐఎస్‌బీ 74వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్ జిల్లా కేంద్రంలో జరిగిన ఆవిర్భావ వేడుకల్లో ముఖ్య అతిథిగా ఏఐఎస్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హకీమ్ నవీద్ పాల్గొని ఏఐఎస్‌బీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐఎస్‌బీ 1951 కొలకత్తా పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో ఏర్పడి నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయాల సాధనకై విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం 74 సంవత్సరాలుగా సమరశీల పోరాటాలు చేస్తూ దేశవ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహిస్తుందని అన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు విద్యారంగాన్నిపూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ కార్పొరేట్ విద్యాసంస్థలకు వత్తాసు పలుకుతున్నారని ఆయన విమర్శించారు. ప్రభుత్వాలు యొక్క అసమర్థత విధానాల వల్ల దేశం లో పేద మధ్యతరగతి విద్యార్థులను నిరుపేదలకు విద్య అందని ద్రాక్షగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ యూనివర్సిటీలలో ఖాళీ ఉన్న వీసీల పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని పెండింగ్‌లో ఉన్నటువంటి ఏడు వేల కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్ మెంట్ విడుదల చేయాలని, ప్రభుత్వ పాఠశాలలో కళాశాలలో ఖాళీ ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అంతేకాకుండా రాష్ట్రంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు చేస్తున్న ఫీజుల దోపిడీని అరికట్టడం కోసం ఫీజు నియంత్రణ చట్టాన్ని రూపొందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ బీ జిల్లా కన్వీనర్ రోహిత్, నాయకులు జి.ప్రవీణ్, అఖిల్, ఫురాన్, యాకూబ్, రవి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలనలో దరఖాస్తుల తంటాలు

## ఎంపీడీఓ ఆఫీస్ చుట్టూ ప్రదక్షిణలు
## ఓటీపీ రావటం లేదంటున్న ఆపరేటర్లు
## ప్రభుత్వానికి మహిళల చీవాట్లు



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** ప్రజా పాలనలో దరఖాస్తులు చేసుకోగా ఆన్ లైన్ లో నమోదు కాకపోవడంతో తంటాలు వచ్చి పడ్డాయి. ప్రజాపాలన లబ్ధిదారుల ఎంపికలో పలు లోపాలు తలెత్తగా, మరోసారి దరఖాస్తులు చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆరు గ్యారంటీల అమలులో భాగంగా ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల్లో శిబిరాలు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించారు. రెండు నెలల అనంతరం వీటిని ఆన్‌లైన్‌లో పొందుపర్చారు. 200 యూనిట్ల ఉచిత కరెంటు, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ అందించేందుకు లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఆయితే అనేక మంది అర్హులకు ఈ రెండు గ్యారంటీలు అమలు కాలేదు. దీంతో ఎంపిక కానీ, వారు తిరిగి దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం కోరగా పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగియడంతో స్థానిక మండల పరిషత్ ఆఫీస్, మున్సిపల్ కార్యాలయంలో తిరిగి లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు అందిస్తున్నారు. ప్రజాపాలన రశీదుతో పాటు కరెంటు బిల్లు, గ్యాస్ బుక్‌కు సంబంధించిన జిరాక్స్ కాపీలతో తిరిగి దరఖాస్తు చేసుకుంటున్నారు. డోర్నకల్ మండలంలోని వెన్నారం, ముల్కలపల్లి, సంకీసా, మన్నెగూడెం, చిల్కోయలపాడు గ్రామం నుంచి మహిళలు ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తు అందించేందుకు రాగా సర్వర్ ప్రాబ్లం అంటూ ఇక్కడి కంప్యూటర్ ఆపరేటర్లు సెలవిస్తున్నారు. దీంతో చిర్రెత్తుతున్న మహిళలు గత మూడు రోజుల క్రితం ఇలానే సమాధానం ఇచ్చారని, వ్యవసాయ చేసుకునే వారితో ఇలా ఆఫిసుల చుట్టు తిప్పించుకోవటం ప్రభుత్వానికి తగదన్నారు. కంప్యూటర్ల పని చేసినప్పుడు గ్రామంలో తెలియపర్చాలని ఆగ్రహించారు.

## మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలి
### కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ సోమవారం మహబూబాబాద్ మండలంలోని రెడ్యాల ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా ఆశ్రమ పాఠశాలలోని పిల్లలకు మౌలిక వసతులు, భోజన సౌకర్యాలు ఎలా ఉన్నాయనే విషయాన్ని పిల్లలతో స్వయంగా మాట్లాడి తెలుసుకున్నారు. భోజన తయారు షెడ్ ,మరుగుదొడ్లలో, పరిసర ప్రాంతాలలో లైటింగ్ తక్కువగా ఉన్నందున రేపటి వరకు ఆయా ప్రాంతాలలో లైటింగ్, నల్లలు ఏర్పాటు చేయాలని, ఉపసంచాలకులు ఎర్రయ్యను ఆదేశించారు. ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలో దాదాపు 292 మంది విద్యార్థులు ఉన్నారని, వారికి సరిపడా వసతులు ఏర్పాటు చేయాలని, భోజనం మెనూ ప్రకారంగా పౌష్టికాహారం అందించాలని అన్నారు. పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశీలించారు. పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, ఈ సందర్భంగా ఉపసంచాకులు ఎర్రయ్యను ఆదేశించారు.

## ఎస్సీ సోషల్ వెల్ఫేర్‌ను ఏర్పాటు చేయాలి




**వరంగల్ వాయిస్, పరకాల :** పరకాల పట్టణంలో ఎస్సీ సోషల్ వెల్ఫేర్ ను ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరకాల పట్టణంలో మున్సిపాలిటీ పక్కనే ఉన్న 5 ఎకరాల భూమిలో గతంలో అక్కడ డిగ్రీ కళాశాలను నిర్మించాలనుకున్నారు. కానీ, అనుకోని కారణాల వల్ల డిగ్రీ కళాశాలను ఎక్కడైతే, ఉందో అక్కడనే సాంక్షన్ కావడం జరిగింది. కాబట్టి, ఆ భూమిలో ఎస్సీ సోషల్ వెల్ఫేర్ హాస్టల్ ను నిర్మించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు సొంత భవన లేక అద్దె భవనాల్లో ఉంటూ విద్యార్థులు అరకొర వసతులతో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే స్పందించి ఎస్సీ వెల్ఫేర్ కు సొంత బిల్డింగ్ నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు మడికొండ ప్రశాంత్, పట్టణ అధ్యక్షుడు బొచ్చు ఈశ్వర్, ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రేమ్, సాయి, తేజ, నితిన్ పాల్గొన్నారు.

## బూడిద శ్రీను మృతిపై కార్మికుల సంతాపం



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డుకు చెందిన మున్సిపల్ కార్మికుడు బూడిద శ్రీను అనారోగ్యంతో మృతి చెందగా మున్సిపల్ కార్మిక సిబ్బంది అతని పార్థివ దేహానికి పూలమాలు వేసి నివాళులు అర్పించి, మృతుడి కుటుంబాన్ని పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికులు సంయుక్తంగా మాట్లాడుతూ మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. తొర్రూరు పురపాలక సంఘం కార్యాలయంలో గత 20 సంవత్సరాల నుంచి అనేక సేవలందించిన శ్రీను చనిపోవడం తోటి కార్మికులమైన మేము తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యామని పేర్కొన్నారు. మృతుడి కుటుంబానికి మున్సిపల్ కార్యాలయం నుంచి వచ్చే ఈపీఎఫ్ రూ.10 లక్షల అమౌంట్ ను సంబంధిత అధికారులు చొరవ చూపి అందించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు వేల్పుల మహేందర్, ప్రశాంత్, ఎల్లయ్య, యాకయ్య, వెంకన్న, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

## ఆర్య వైశ్య విద్యార్థినులకు హైదరాబాద్‌లో హాస్టల్ వసతి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వాసవి ఆర్య వైశ్య హాస్టల్ ట్రస్ట్ చైర్మన్ గంజి రాజమౌళి గుప్తా ఆధ్వర్యంలో నూతనంగా ఆధునిక వసతులతో నిర్మించిన బాలికల భోజనం, వసతి గృహం ముషీరాబాద్, హైదరాబాద్ లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ట్రస్ట్ జాయింట్ సెక్రటరీ గట్టు మహేష్ బాబు పిలుపునిచ్చారు. జులై 1 నుంచి ప్రారంభమయ్యే హాస్టల్ లో ప్రవేశాల కోసం డిగ్రీ, పీజీ చదివే ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన అర్హులైన వైశ్య ప్రతిభావంతులైన విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హులైన వారిని తాము సిఫార్సు చేస్తానంటూవివరాలకు 8099839966,8341785462 మొబైల్ నెంబర్‌లలో తనను సంప్రదించవచ్చునని మహేష్ బాబు సూచించారు.

## రేపు పాఠశాలల బంద్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సర్కార్ బడుల్లో సమస్యలు పరిష్కరించాలని, ప్రైవేట్ స్కూల్లో ఫీజులు అదుపు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 26న ఏబీవీపీ రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల బంద్ కు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాళ్లపెల్లి అరుణ్ తాను మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసి మాట్లాడుతూ ప్రైవేట్ కార్పొరేట్ స్కూల్లో ఫీజుల నియంత్రణకు చట్టం చేయాలన్నారు. ప్రైవేట్ స్కూల్లో బుక్స్, యూనిఫామ్ అమ్మకాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. డీఈవో, ఎంఈఓలను నియమించాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్నం భోజనం అవకతవకలపై విచారణ జరపాలని, మెగా డీఎస్సీ ద్వారా 24వేల ఖాళీలు భర్తీ చేయాలన్న డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు బంద్‌కు పిలుపునిస్తున్నట్లు అరుణ్ తెలిపారు.

## అంగన్వాడీ కేంద్రాల్లో ప్రాథమిక విద్య అమలుపై శిక్షణ



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** అంగన్వాడీ కేంద్రాల్లో ప్రాథమిక విద్య బలోపేతం చేసేందుకు పూర్వ ప్రాథమిక పాఠశాల (ప్రీ స్కూల్స్)ను ఏర్పాటు చేస్తున్నామని డోర్నకల్ ప్రాజెక్ట్ ఆధికారి (సీడీపీఓ) ఎల్లమ్మ, మాస్టర్ ట్రైనర్ వెంకటరమణ తెలిపారు. మంగళవారం మండలంలోని గోల్లచర్ల సర్కిల్ పరిధిలోని అంగన్వాడీ టీచర్లకు బుర్గపాడు ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన మూడు రోజుల ట్రైనింగ్ క్లాస్లలో ప్లేస్కూల్ నిర్వహణపై దిశా నిర్దేశం చేశారు. గ్రామాల్లోని 3-6 సంవత్సరాలు వయస్సు గల పిల్లలకు నర్సరీ, ఎల్ కేజీ, యూకేజీ స్థాయిలో ప్రేరణాత్మక, కృత్య ధార బోధన ఉంటుందని వారు తెలిపారు. విద్యార్థులకు ఆట పాటలు, ప్రకృతి, సైన్స్, యోగ, గణితంతో పాటు రంగులు ఇతర అంశాలపై అవగాహన కల్పించాలని శిక్షణ ఇచ్చారు. ప్రతి రోజు ఉదయం 9-4 వరకు వివిధ కార్యక్రమాలు, కృత్యాలతో పిల్లలకు విద్యా బోధన చేయాలని వివరించారు. పిల్లల్లో వచ్చిన మార్పులు అభివృద్ధిని ఎప్పటికప్పుడు తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలోని గౌడ సంఘం నాయకుడు గుర్రం సదానందం తల్లి గుర్రం లక్ష్మి అకాల మరణం చెందగా మంగళవారం టీపీసీసీ ఉపాధ్యక్షులు దొమ్మాటి సాంబయ్య ఆమె పార్థివ దేహానికి పూలమాలలువేసి, నివాళులు అర్పించి, వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్, సీనియర్ నాయకుడు పర్నెం తిరుపతి రెడ్డి, బొల్లె బిక్షపతి, మున్సిపల్ కౌన్సిలర్లు మడికొండ సంపత్ కుమార్, ఒంటెరు సారయ్య, నల్లెల్ల జ్యోతి అనిల్, పసుల లావణ్య-రమేష్, కాంగ్రెస్ పార్టీ, గౌడ సంఘం నాయకులు దొమ్మాటి సదానందం గౌడ్, బండి కుమార్ గౌడ్, మార్క నారాయణ గౌడ్, బండి సమ్మయ్య గౌడ్, డాక్టర్. మడికొండ శ్రీను, మెరుగు శ్రీశైలం గౌడ్, ఆముదాలపల్లి మల్లేష్ గౌడ్, పుల్యాల గాంధీ, మరుపట్ల మహేష్, పోషణపల్లి నాగరాజు, దూలం వేణు గౌడ్, మార్క తిరుపతి గౌడ్, దండ్రె శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## శానిటేషన్ పనుల టెండర్‌కు దరఖాస్తుల ఆహ్వానం

**వరంగల్ వాయిస్, పరకాల :** మండల కేంద్రానికి సమీపంలోని టీఎస్‌డబ్ల్యూఆర్ (బాలికలు)లో 2024-25 విద్యా సంవత్సరానికి స్వీపింగ్/ శానిటేషన్ కాంట్రాక్ట్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఇంచార్జి ప్రిన్సిపాల్ ఉషారాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రిన్సిపాల్ టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్/జేసీ (బాలికలు) పరకాల పేరున ఎస్బీఐ బ్రాంచ్‌లో రూ. 1000 డీడీ ద్వారా చెల్లించి పాఠశాలలో టెండర్ దరఖాస్తు ఫారం పొందాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ వారికి డిపాజిట్‌లో 40 శాతం మినహాయింపు ఉంటుందన్నారు. జూన్ 28 మధ్నాహ్నం 12 లోపు సీల్డ్ టెండర్ కవర్ బాక్స్‌లో వేయాలన్నారు. సీల్డ్ టెండర్‌ను జూన్ 28న తెరిచి అర్హులను ప్రకటించనున్నట్లు తెలిపారు. ఆసక్తిగలవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## ఫైర్ స్టేషన్ ఆఫీసర్‌గా వీరేష్



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** డోర్నకల్ ఫైర్ స్టేషన్ ఆఫీసర్‌గా వీరేష్ నల్లమాద నియమితులయ్యారు. గతంలో కన్సిస్టేబుల్ విధుల నిర్వహించిన ఆయన ఎస్ఐ పరిక్షలల్లో ఉత్తీర్ణత సాధించి ట్రైనింగ్ అనంతరం డోర్నకల్ ఫైర్ స్టేషన్ అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఫైర్ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

# హనుమకొండ డీఈఓను సస్పెండ్ చేయాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ డీఈవోను సస్పెండ్ చేయాలని కోరుతూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ హనుమకొండ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ఏకశిలా హైస్కూల్ డబ్బాల్ కేయూ రోడ్ పాఠశాలలో ప్రభుత్వ వ్యతిరేకంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, బుక్స్ మీద పాఠశాల పేరు ముద్రించి విక్రయిస్తున్నారని ఏబీవీపీ డీఈవోకు వినతి పత్రం ఇవ్వగా, డీఈఓ ఎంఈఓను పంపించి పాఠశాల పుస్తకాలు అమ్ముతున్న రూమ్ ని సీజ్ చేశారు. అయినప్పటికీ పాఠశాల యజమాన్యం సీల్ ఓపెన్ చేసి యథావిధిగా పుస్తకాలు విక్రయిస్తున్నారు. ఇదేంటని ఎంఈఓను, డీఈఓను అడిగితే నేనే అమ్ముకోమన్న అంటూ డీఈఓ చెబుతున్నారని, ఏకశిలా యజమాన్యానికి డీఈఓ తొత్తుగా మారి వ్యవహరిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ విద్యా హక్కు చట్టం-2009 ప్రకారం ఎలాంటి క్యాపిటేషన్ ఫీజు, అడ్మిషన్ ఫీజు లేకుండా విద్యార్థుల నుంచి ఫీజు వసూలు చేయాల్సి ఉంటుంది. కానీ ఏకశిలా హైస్కూల్ లో యాజమాన్యం ఇష్టారాజ్యంగా ఫీజులు వసూల చేస్తున్న తీరుకు హనుమకొండ డీఈఓ వత్తాసు పలుకుతున్నాడని, కేవలం కార్పొరేట్ విద్యాసంస్థల బానిసగా మారిన హనుమకొండ డీఈఓను వెంటనే సస్పెండ్ చేయాలని, అదేవిధంగా పాఠశాలను పర్మిషన్ రద్దు చేయాలని కలెక్టర్ పి.పావీణ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో విభాగ్ కన్వీనర్ నిఖిల్, జిల్లా కన్వీనర్ సుజిత్, అరుణ్, శ్రీనివాస్, గాంధీ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా బలిదాన్ దివాస్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** శ్యామప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ కార్యక్రమం 56వ డివిజన్ లో బీజేపీ ముఖ్య నాయకులు జన్ను మధు ఆధ్వర్యంలో 56 డివిజన్ అధ్యక్షుడు మందోటి మహేందర్ పటేల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ శాసనసభ్యులు మార్తినేని ధర్మారావు హాజరై మాట్లాడుతూ 1901, జూలై 6 న జన్మించిన శ్యాంప్రసాద్ ముఖర్జీ ప్రముఖ జాతీయవాద నేతలలో ముఖ్యుడన్నారు. 1951లో భారతీయ జనసంఘ్ పార్టీ స్థాపించిన ముఖర్జీ ఆధునిక హిందుత్వ, హిందూ జాతీయవాదాన్ని ప్రగాఢంగా విశ్వసించారని తెలిపారు. హిందూ మహాసభ, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సభ్యుడైన శ్యాం ప్రసాద్ ముఖర్జీ, జనసంఘ్‌ను స్థాపించి దేశంలో తొలి హిందూవాద రాజకీయ పార్టీని స్థాపించిన నేతగా స్థానం పొందారని కొనియాడారు. స్వాతంత్ర్యానికి పూర్వం జవహర్ లాల్ నెహ్రూ నేతృత్వంలోని మధ్యంతర ప్రభుత్వంలో పరిశ్రమల మంత్రిగా పనిచేసి, 1949లో ఢిల్లీ ఒప్పందానికి వ్యతిరేకంగా కాంగ్రెసు పార్టీ నుంచి తప్పుకొని అక్టోబర్ 21, 1951న జనసంఘ్ పార్టీని స్థాపించారు. ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడిగా మే 23, 1953 న మరణించే వరకు కొనసాగారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట మాజీ శాసనసభ్యుడు, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, సెంట్రల్ ఫిల్మ్ సెన్సార్ బోర్డు మెంబర్ జన్ను మధు, డివిజన్ అధ్యక్షుడు మందోటి మహేందర్, ఉపాధ్యక్షులు లేగల శివరాం, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి తక్కళ్లపెల్లి అమృతరావు, జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శి కటకం రాజేష్, ఓబీసీ మోర్చా జిల్లా కార్యాలయ కార్యాదర్శి అలుగునూరి కృష్ణం రాజు, డివిజన్ ఇంచార్జి బండి హరీష్, సీనియర్ నాయకులు కోటగిరి నరేందర్, వేల్పుల శ్రీనివాస్, ముల్కనూరు చంద్రమౌళి, బొద్దిరెడ్డి సురేందర్ రెడ్డి, నల్ల రమేష్, కొత్తపెల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

# మామను చంపిన అల్లుడికి యావజ్జీవ శిక్ష



**వరంగల్ వాయిస్, హసన్ పర్తి :** బిడ్డను ఇచ్చిన మామను కడతేర్చిన అల్లుడికి యావజ్జీవ జైలు శిక్ష విధిస్తూ హనుమకొండ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి బి.అపర్ణా దేవి మంగళవారం తీర్పు వెలువరించారు. హసన్ పర్తి సీఐ సురేష్, పర్యవేక్షణలో జరిగిన కేసు పూర్వాపరాల ప్రకారం హసన్ పర్తి గ్రామానికి చెందిన నిందితుడు పోతరాజు వెంకటేష్ కు నడికూడ మండలం కంఠాత్మకూర్ గ్రామానికి చెందిన మృతుడు జక్క ఎల్లయ్య కూతురు స్వాతితో 2013లో పెళ్లి జరిగింది. వీరికి ఒక కుమారుడు, మెడికల్ షాప్ లో పనిచేసే నిందితుడు వెంకటేష్ త్రాగుడుకు బానిస కావడంతో పనిలో నుంచి తొలగించారు. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య అనేక కలహాలు చోటు చేసుకున్నాయి. 6-10-2020 రోజున తన ఇంటికి వచ్చిన మామ ఎల్లయ్యను మందు తాగుదామని నమ్మించి హసన్ పర్తి పెద్ద చెరువు కట్ట సమీపానికి తీసుకెళ్లి గొడ్డలితో నరికి చంపిన వెంకటేష్ ఎవరూ గుర్తు పట్ట కూడదని మృతదేహాన్ని హసన్ పర్తి పెద్ద చెరువులో పడేశాడు. ఆ తరువాత భయంతో పోలీసులకు లొంగిపోయి జరిగిన హత్యను వివరించగా అప్పటి హసన్ పర్తి సీఐ శ్రీధర్ రావు, ఎస్ఐ రాజకుమార్ కేసు దర్యాప్తు చేశారు. నేరం రుజువు కావడంతో నిందితుడు వెంకటేష్ కు యావజ్జీవ శిక్ష విధించారు. కోర్టు డ్యూటీ హెడ్ కానిస్టేబుల్ వల్లబోజు వి.రవీందర్ సాక్షులను ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రోసిక్యూటర్ బి.రాజ మల్లారెడ్డి ప్రోసిక్యూషన్ తరపున వాదించారు.

# ప్రజా వ్యతిరేక నిర్ణయాలు ఉపసంహరించుకోవాలి




**వరంగల్ వాయిస్, వరంగల్ :** గత బీజేపీ ప్రభుత్వరం తీసుకున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలు, చట్టాలను ఉపసంహరించుకోవాలని, జూలై 1న దేశ వ్యాప్తంగా కలెక్టరు కార్యాలయాల ఎదుట నిర్వహించే ధర్నాలు జయప్రదం చేయండని ఎంసీపిఐ(యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్ది కాయల అశోక్ ఓంకార్ పిలుపునిచ్చారు. మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (యునైటెడ్) కేంద్ర కమిటీ సమావేశాలు జూన్ 22,23,24 తేదీల్లో విజయవాడ లో ఎంసీపీఐ(యూ) పోలిట్ బ్యూరో సభ్యుడు కామ్రేడ్ కిరణ్ జిత్ సింగ్ షేఖాన్ అధ్యక్షతన జరిగినాయి. ఈ సమావేశం నిర్ణయాలు ఎంసీపీఐ(యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ మద్ది కాయల అశోక్ ఓంకార్ పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి మంగళవారం ఓంకార్ భవన్ బాగ్ లింగంపల్లి ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యాలయం నుంచి విడుదల చేశారు. తొలుత సమావేశంలో ఎంసీపీఐ యూ తెలంగాణ రాష్ట్ర కమిటీ సీనియర్ నాయకులు కామ్రేడ్ ఎస్కే మాసూం, సీపీఐ జాతీయ కార్యదర్శి కామ్రేడ్ అతుల్ కుమార్ అంజన్ వివిధ సంఘటనల్లో మరణించిన వారందరికీ 2 నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. కేంద్రం, బీజేపీ ప్రభుత్వం చావు తప్పి కన్ను లొట్ట పోయినట్లుగా మూడో సారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిందన్నారు. బీజేపీకి కేంద్రంలో సీట్లు తగ్గి స్వతహాగా ప్రభుత్వం ఏర్పాటు చేసే మెజార్టీని ప్రజలు ఇవ్వక పోవటానికి కారణం గత పది సంవత్సరాలుగా ఏక పక్ష నియంతృత్వ, కార్పొరేట్, మత విద్వేష, విధానాలు అవలంబించి అనేక ప్రజాస్వామ్య గణతంత్ర భావాలు గలిగిన రాజ్యాంగ చట్టాలను ఉల్లంఘించి తప్పుడు అప్రజాస్వామిక చట్టాలను తెచ్చిన విధానాన్ని భారత ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారని అన్నారు. బీజేపీ ప్రజా వ్యతిరేక, మనువాద ఫాసిస్టు పాలనా విధానాలను అవలంబించిందని, ఈ విధానం ఫలితమే బీజేపీ 303 సీట్లు నుంచి 240 సీట్లు వద్ద ప్రజలు ఆపారన్నారు. కాబట్టి, ప్రజల మనోభావాలను బీజేపీ గౌరవించాలని కోరారు. గత బీజేపీ ప్రభుత్వం తీసుకున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలు, చట్టాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరుతూ దేశవ్యాప్తంగా జూలై 1న ఎంసీపీఐ(యూ) కలిసి వచ్చే అన్ని శక్తులతో కలసి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నాలు చేసి భారత రాష్ట్రపతికి మెమోరాండాలు ఇవ్వాలని కేంద్ర కమిటీ నిర్ణయం చేసిందన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశం లో పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు కాటం నాగభూషణం, గాదగోని రవి, అనుభవ్ దాస్ శాస్త్రి, మహేందర్ నేహా, శ్రీ కుమార్, వనం సుధాకర్, అడ్వకేట్ రాజా దాస్, కేంద్ర కమిటీ సభ్యులు వనం సుధాకర్, గోనె కుమారస్వామి, కుంభం సుకన్య, ఎండీ ఖాదర్ బాషా, కృష్ణా మ్మాల్, హన్సీస్ పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించండి




**వరంగల్ వాయిస్, కాజీపేట :** స్థానిక విష్ణుపురి కాలనీలో మంగళవారం ఏఐటీయూసీ కాజీపేట నాయకులు మాలోత్ శంకర్ నాయక్ అధ్యక్షతన భవన నిర్మాణ కార్మికుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏఐటీయూసీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి, ప్రధాన కార్యదర్శి జక్కురాజు గౌడ్ హాజరై మాట్లాడుతూ తెల్లవారితే ఆదివారం అడ్డ మీద పని కోసం వెతుకుతూ కూలీ దొరకకపోతే కుటుంబం గడిచేదే లేదని వస్తువులే తప్ప మరో మార్గం లేదని దినదినం గండంగా బతుకు లీడ్ ఇస్తున్న అడ్డ కూలీలకు సర్కార్ నుంచి భరోసా కరువైందన్నారు. కార్మిక సంక్షేమ శాఖ నుంచి అందవలసిన సాయం వారికి అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దరఖాస్తు చేసి సంవత్సరాలు గడుస్తున్న ప్రభుత్వ సహాయం అందక అవస్థలు పడుతున్నారని తెలిపారు. దీంతో దిక్కుతోచని స్థితిలో కార్మికులు కార్మిక శాఖ అధికారులు చుట్టూ ప్రదర్శన చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం కార్మిక సంక్షేమ శాఖ నుంచి నిర్మాణరంగ కార్మికులకు పలు ప్రయోజనాలను అందజేస్తుందని ఎదురుచూసినప్పటికీ ఫలితం లేకుండా పోయిందన్నారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలోని కార్మికులు సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసుకున్న సుమారు 8000 పైబడి దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం లేబర్ అధికారులు తక్షణమే కార్మికుల సమస్యలను దరఖాస్తులను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే కార్మికులందరిని ఐక్యం చేసి పెద్ద ఎత్తున పోరాటాలు, ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు మాలోత్ శంకర్ నాయక్, ఆర్.పూర్ణచందర్, ఎస్.లక్ష్మి, కళ్యాణి, మేరీ, ఎ.శ్రీనివాస్, సీహెచ్ విక్రమ్, కుమార్, కె.రవి, కె.అనిత, బి.మహేష్, శివకుమార్ తదితర కార్మికులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యాసంస్థలపై సర్కార్ నిర్లక్ష్యం

## పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహారావు




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రభుత్వ విద్య సంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు కనీస మౌలిక వసతులు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం నిర్వహిస్తున్నదని పీడీఎస్ యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నరసింహారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం పీడీఎస్ యూ ఆధ్వర్యంలో "ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని, ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడిని అరికట్టాలని" డిమాండ్ చేస్తూ హనుమకొండ డీఈఓ డాక్టర్ ఎండీ అబ్దుల్ హైకి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ప్రతినిధి బృందంగా అందజేశారు. ఈ సందర్భంగా బి.నరసింహారావు మాట్లాడుతూ విద్యాసంస్థలు ప్రారంభమై 15 రోజులు కావోస్తున్న ప్రభుత్వ విద్యాసంస్థల్లోని సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్న చందంగా మారిందని, దళిత, గిరిజన, బడుగు, బలహీన పేద వర్గాల విద్యార్థులు సమస్యలతో సతమతమవుతూ చదువులు కొనసాగించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల సంఖ్యకు సరిపడా తరగతి గదులు లేక ,బాత్రూం, టాయిలెట్ రూమ్స్ వంటి సౌకర్యాలు లేక, సరిపడ ఉపాధ్యాయులు లేక, స్కూలు శుభ్రం చేసే స్కావెంజర్లు లేక ప్రభుత్వ విద్యా వ్యవస్థ కుంటుపడుతున్నదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సరిపడా పాఠ్య, నోట్ పుస్తకాలు, టై, బెల్టు, షూస్ సకాలంలో పూర్తిస్థాయిలో అందించకపోవడంతో అనేక అవస్థలు పడుతూ చదువులు కొనసాగించాల్సి వస్తుందని తెలిపారు. మరోవైపు ప్రభుత్వా నిబంధనలు పాటించకుండా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు రకరకాల తోక పేర్లతో పదుల సంఖ్యలో అక్రమంగా బ్రాంచ్ లను ఏర్పాటు చేసుకొని విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద నుంచి లక్షలాది రూపాయల ఫీజులను గుంజుతూ విద్యను పూర్తిగా వ్యాపారమయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత విద్యాశాఖ అధికారులు స్పందించి ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని, మధ్యాహ్న భోజనానికి అధిక నిధులు కేటాయించాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను శాశ్వత ప్రతిపాదికన భర్తీ చేయాలని, అన్ని స్కూల్స్ లో స్కావెంజర్లను నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకుంటే పీడీఎస్ యూఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ యూ జిల్లా నాయకులు నర్సయ్య, పి.రాజ్ కుమార్, ఉదయ్, ఎం.రమేష్, అనిల్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

## మంత్రి తమ్మలను కలిసిన ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** చేనేత, మరమగ్గాల వృత్తిదారుల సమస్యలు పరిష్కరించి వారి ఆత్మహత్యలు నివారించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలంగాణ వ్యవసాయ, సహకార, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావును, పరిశ్రమలు అండ్ చేనేత, జౌళి శాఖ ముఖ్య కార్యదర్శిని, చేనేత అండ్ జౌళి శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ శైలజా రామాయ్యర్ ను మంగళవారం మర్యాద పూర్వకంగా ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ తెలంగాణ స్టేట్ కమిటీ సభ్యులు కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం అధ్యక్షుడు వేముల బాలరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ బసబత్తిని రాజేశం, ప్రధాన కార్యదర్శి చోలా రాజేశ్వర్, కోశాధికారి గవ్వల శంకర్, కన్వీనర్ వనం శాంతి కుమార్, కో-ఆర్డినేటర్ గడ్డం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నిల్వ ఉన్న చేనేత వస్త్రాలను ప్రభుత్వం కొనుగోలు చేసి, బకాయి డబ్బులు చెల్లించాలని కోరారు. తెలుగు రాష్ట్రాలలోని 19 చేనేత కులాలు ఐక్యమై "ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్"గా ఏర్పాటు చేశారని వారు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 19 కులాలు చేనేత వృత్తి పైన ఆధారపడి ఉన్నాయని, నాటి స్వాతంత్ర్య ఉద్యమంలోను తన వంతు వీరోచిత పాత్ర పోషించి, నరులు నగ్నత్వాన్ని దాచి, నాగరికత పెంపొందించిన చేనేత కళను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని వారు పేర్కొన్నారు. నాడు ప్రపంచ ప్రఖ్యాతి పొందినప్పటికీ, నేడు అనేక సమస్యలతో చేనేత వృత్తిదారులు ఆకలి చావులు, ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా చేనేత కులాలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించి వారి ఆత్మహత్యలను నివారించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు వేముల బాలరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ బసబత్తిని రాజేశం, ప్రధాన కార్యదర్శి చోలా రాజేశ్వర్, కోశాధికారి గవ్వల శంకర్, కన్వీనర్ వనం శాంతి కుమార్, కో-ఆర్డినేటర్ గడ్డం వెంకటేశ్వర్లు, సభ్యులు రాపోలు జగన్, పీజీకే వెంకటేశ్వర్ రావు, రాపోలు జ్ఞానేశ్వర్, బోగం లక్ష్మయ్య, పసలాడి సబిత, పాశికంటి లక్ష్మి నర్సయ్య, బి.పుల్లయ్య, పి. ప్రకాశ్, లోక లక్ష్మిరాజ్యం, వడ్డేపల్లి పరమేష్, బి. కృష్ణారావు, ఉమేష్ కుమార్ జయతేనే, పరిమెలశెట్టి వెంకట రావు, మల్లికార్జున్ అడ్కి, తాడిచెట్టి జయచంద్ర మోహన్, రమేష్ గైక్వాడ్, వి. బాలకిషన్ పాల్గొన్నారు.




## అఖిల భారత పద్మశాలి డివిజన్ అధ్యక్షులకు సన్మానం




**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ జిల్లా అఖిలభారత పద్మశాలి జిల్లా అధ్యక్షుడు ఆడెపు రవీందర్, కోఆర్డినేటర్ వడ్నాల నరేందర్ ఆధ్వర్యంలో19వ డివిజన్ అధ్యక్షులుక్యాతం రంజిత్, 20వ డివిజన్ అధ్యక్షుడు ములుక సురేష్, 26వ డివిజన్ అధ్యక్షుడు కూచనరమేష్, కార్యవర్గ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి డివిజన్ అధ్యక్షులను ఘనంగా సన్మానించారు. వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఆడెపు రవీందర్ మాట్లాడుతూ పద్మశాలి అందరు సమిష్టిగా కలిసి ఉండాలని మార్కండేయ జయంతి పలు కార్యక్రమాలనుయాక్టివ్‌గా చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో సామల వెంకటస్వామి, బొద్దుల కుమార్, వేముల నాగరాజు, వంగరి రాంప్రసాద్, దుస్సాకృష్ణ, కుందారపు గోపి, గుండు శ్రీనివాస్, బాలమోహన్ రాజ్, చిలగాని రమేష్, బొప్పరాతి నగేష్, కూచన శివ, సిరిపురం శశి బాబు, రామ శివ, రంగుశ్రీధర్, చింతకింది రాజకుమార్, పద్మశాలి కులస్తులు పాల్గొన్నారు.

## ఏరియా ఆసుపత్రి నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి



**వరంగల్ వాయిస్, ములుగు :** 200 పడకల ఏరియా ఆసుపత్రి చివరి దశ నిర్మాణ పనులలో వేగం పెంచి, త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్. ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, అదనపు కలెక్టర్ రెవెన్యూ సీహెచ్ మహేందర్ జితో కలిసి ప్రేమ్ నగర్ లోని ఏరియా ఆసుపత్రి నిర్మాణ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చివరి దశ నిర్మాణ పనులలో వేగం పెంచాలని, నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. తాత్కాలికంగా ఈ భవనంలో మెడికల్ కళాశాలకు కేటాయించగా 2024-2025 విద్యా సంవత్సరానికి 50మంది విద్యార్థులతో మొదటి సంవత్సరం తరగతులను ప్రారంభిస్తున్నామని తెలిపారు. అనంతరం మెడికల్ కళాశాల కోసం కేటాయించిన గ్రౌండ్ స్థలాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించి ప్రభుత్వ స్థలాన్ని ఎవరైనా ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సత్య పాల్ రెడ్డి, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బానోత్ మోహన్ లాల్, ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ జగదీశ్వర్, ములుగు తహసిల్దార్ విజయ భాస్కర్ పాల్గొన్నారు.

# ఎమర్జెన్సీ ప్రజాస్వామ్యానికి చీకటి రోజు

## బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కీర్తి రెడ్డి



**వరంగల్ వాయిస్, ములుగు :** జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఎమర్జెన్సీ చీకటి దినం సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చందుపట్ల కీర్తి రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1977 మార్చి 21 వరకు ఇందిరాగాంధీ రాజకీయ ప్రత్యర్థులను జైలుపాలు చేసి ప్రతికలను సెన్సార్ చేశారన్నారు. వాస్తవాలను చెప్పేందుకు ప్రయత్నించిన పత్రికలపై తీవ్ర నిర్బంధం విధించారని, ప్రశ్నించే మేధావులు, పాత్రికేయుల గొంతునొక్కారని, ఎన్నో సంస్థలను రద్దు చేశారని విమర్శించారు. భారత దేశ ప్రజాస్వామ్య చరిత్రలోనే 1975 జూన్ 25న ఒక 'చీకటి రోజు'గా నిలిచిపోయింది. ఇదే రోజున నాటి ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ దేశంలో అంతర్గత అస్థిరతను, అశాంతిని కారణంగా చూపుతూ జాతీయ అత్యవసర పరిస్థితిని ప్రకటించి, భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను తుంగలో తొక్కారు. ఇదే రోజున ప్రధాన మంత్రి ఆదేశాల మేరకు హేమాహేమీ నాయకులైన అటల్ బిహారీ వాజ్‌పేయి, మొరార్జీ దేశాయ్, బిజూ పట్నాయక్, చంద్రశేఖర్ లాంటి మరెందరో ప్రముఖులతో సహా లక్ష మందికి పైగా ప్రజలను నిర్బంధించి జైళ్లలో పెట్టారు. 'ఎమర్జెన్సీ'అంటే ఇందిరా గాంధీకి ఒక పర్యాయపదంగా మారిపోయింది. 1975 జూన్ 25న విధించిన ఎమర్జెన్సీ 1977 మార్చ్ 21 వరకు అంటే 21 నెలల పాటు అమలులో ఉంది. నాటి రాష్ట్రపతి ఫక్రుద్దీన్ ఆలీ అహ్మద్ రాజ్యాంగంలోని ఆర్టికల్ 352 ప్రకారం దేశంలో అంతర్గత అశాంతిని కారణంగా ఉటంకిస్తూ అధికారికంగా ఎమర్జెన్సీని జారీ చేశారని కాంగ్రెస్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని విమర్శించారు. అనంతరం నల్ల బ్యాడ్జి ధరించి ర్యాలీ చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమం లో రాష్ట్ర జిల్లా మండల నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతు భరోసాపై రైతుల వినతులు



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** పట్టణ కేంద్రంలోని రైతు వేదికలో రైతు భరోసాపై రైతుల నుంచి ప్రభుత్వానికి వినతుల కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిర్వహించిన రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ లో వర్ధన్నపేట నియోజకవర్గ రైతులతో కలిసి జిల్లా కలెక్టర్ సత్య శారదా, జేడీ ఉషాదయల్, ఏడీ సురేష్, తహశీల్దార్ విజయసాగర్, మున్సిపల్ కమిషనర్ జోనా, చైర్ పర్సన్ అరుణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి రైతులు తదితరులు ఉన్నారు

## బాధిత కుటుంబానికి నాగుర్ల పరామర్శ



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని నర్సక్క పల్లి గ్రామానికి చెందిన కౌడగాని అశోక్ రావు అనారోగ్యంతో మరణించగా వారి నివాసానికి తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు వెళ్లి పార్థివదేహానికి పూలమాలవేసి, నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను ఓదార్చి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్ రావు, ఆర్ఎంపీ, పీఎంపీల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగుర్ల సంతోష్, మాజీ ఉపసర్పంచ్ ధర్మారావు, నాయకులు బాబురావు, ప్రతాప్ రెడ్డి, వీరన్న, దేవేందర్, శివరావు, కిషన్ రావు, ఆనందరావు, శ్రీనివాస్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## డీసీపీకి శుభాకాంక్షలు తెలిపిన మహేష్ నాయక్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సెంట్రల్ జోన్ డీసీపీ సలీమాను గిరిజన సంక్షేమ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు నునావత్ మహేష్ నాయక్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో డీసీపీ సలీమా ఇటీవల బదిలీపై రావడంతో మహేష్ నాయక్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కేసులు పెండింగ్ లో ఉన్నాయని త్వరితగతిన అవి పరిష్కరించేలా చూడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో భూక్యా మోహన్ తదితరులు పాల్గొన్నారు.


## పెద్దెల్లి ప్రకాష్‌కు దొమ్మాటి సాంబయ్య పరామర్శ




**వరంగల్ వాయిస్, పరకాల :** టీపీసీసీ కార్యదర్శి, ప్రముఖ అడ్వకేట్, గోదావరిఖని కార్పొరేటర్ పెద్దెల్లి ప్రకాష్ తల్లి పెద్దెల్లి మధునమ్మ గత ఐదు రోజుల క్రితం అకాలమరణం చెందగా మంగళవారం టీపీసీసీ ఉపాధ్యక్షులు దొమ్మాటి సాంబయ్య పెద్దెల్లి మధునమ్మ చిత్రపటానికి పూలమాలలువేసి, నివాళులు అర్పించి, వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. పరకాల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పర్నెం తిరుపతి రెడ్డి, బొల్లె భిక్షపతి, బొజ్జం రమేష్, మున్సిపల్ కౌన్సిలర్లు మడికొండ సంపత్ కుమార్, పసుల లావణ్య రమేష్, నాయకులు డాక్టర్ మడికొండ శ్రీను, లక్ష్మీపురం మాజీ సర్పంచ్ ఆముదాలపల్లి మల్లేష్ గౌడ్, పుల్యాల గాంధీ, దండ్రే శంకర్ పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 6న ఎమర్జెన్సీ

## అధికారికంగా ప్రకటించిన నటి కంగనా రనౌత్



బాలీవుడ్ కథానాయిక కంగనా రనౌత్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం ఎమర్జెన్సీ సినిమా కొత్త విడుదల తేదీని కంగనా ప్రకటించారు. 'దేశంలో అత్యయిక స్థితి ఏర్పడి మంగళవారం నాటికి 49 ఏళ్లు పూర్తయి 50వ ఏడాదిలోకి అడుగుపెడుతున్నాం. అందుకే ఆ చీకటి రోజులకు సంబంధించిన ఈ సినిమా విడుదల తేదీని నేడు ప్రకటిస్తున్నా' అంటూ సెప్టెంబర్ 6న 'ఎమర్జెన్సీ ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం విడుదల కానున్నట్లు వెల్లడించారు. 'ఎమర్జెన్సీ కంగనాకు ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్. 'మణికర్ణిక' తర్వాత ఆమె డైరెక్ట్ చేసిన రెండో సినిమా ఇది. ఈ ప్రాజెక్ట్ కోసం జాతీయ, అంతర్జాతీయస్థాయిలో ప్రతిభావంతులు పని చేశారు. మొదట ఈ సినిమాను గతేడాది నవంబర్ 24న విడుదల చేయాలని భావించారు. ఆతర్వాత జూన్ 14కు మరోసారి వాయిదా వేశారు. ఇప్పుడు అన్ని పనులు పూర్తికావడంతో సెప్టెంబర్ 6ను ఫిక్స్ చేశారు. గతంలో ఓ సందర్భంలో కంగనా ఈ సినిమా గురించి మాట్లాడుతూ.. తనకు సంబంధించిన ఆస్తులన్నింటినీ దీనికోసం తనఖా పెట్టినట్లు చెప్పారు. మొదటి షెడ్యూల్ సమయంలో డెంగీ బారినపడి రక్తకణాల సంఖ్య భారీగా పడిపోయినా షూట్‌లో పాల్గొనాల్సి వచ్చిందన్నారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జీవితం ఆధారంగా దీన్ని తెరకెక్కించారు. ఈ చిత్రానికి కంగనా నిర్మాతగానూ వ్యవహరించారు. జయప్రకాష్ నారాయణ్ పాత్రలో అనుపమ్ ఖేర్, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ పాత్రలో శ్రేయస్ తల్పడే కనిపించ నున్నారు.



# కల్కిలో చేరడానికి ఏడాది ఆలోచించా..

ఎన్నో రోజులుగా ప్రభాస్ అభిమానులతో పాటు సినీ ప్రియులంతా ఎదురుచూస్తోన్న 'కల్కి'మరికొన్ని గంటల్లో అంటే ఈ నెల 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక ఇందులో ఎంతో శక్తిమంతమైన అశ్వత్థామ పాత్రను బాలీవుడ్ లెజెండ్ అమితాబ్ బచ్చన్ పోషించారు.తాజాగా ఆయన మరో ఆసక్తికర పోస్ట్ పెట్టారు. అలాగే కమల్‌హాసన్ కూడా ఈ సినిమాను అంగీకరించ డానికి ఏడాది ఆలోచించినట్లు తెలిపారు. 'కల్కి'లో అగ్ర కథానాయకుడు కమల్ హాసన్ విలన్‌గా కనిపించనున్నారు. సుప్రీం యాస్కిన్ పాత్రను ఆయన పోషించారు. తాజాగా ఆయన ఈ సినిమా గురించి మాట్లాడుతూ.. తన పాత్రను అంగీకరించడానికి ఏడాది సమయం తీసుకున్నట్లు తెలిపారు. 'ఈ పాత్ర గురించి చెప్పగానే నాకు స్వీయసందేహం వచ్చింది. నేను దీన్ని చేయగలనా అనిపించింది. గతంలో చాలా సినిమాల్లో విలన్‌గా నటించాను. కానీ, ఇది వాటికి మించినది. భిన్నమైన పాత్ర. అందుకే దీనికి సంతకం చేయడానికి ఏడాది ఆలోచించా' అని చెప్పారు. అమితాబ్ బచ్చన్ తాజాగా తన బ్లాగ్‌లో ఓ పోస్ట్ చేశారు. 'కల్కి రిలీజ్‌కు ముందు రామచరితమానస్ చదవడం ఆనందంగా ఉంది. ఎన్ని యుగాలు గడిచినా కొన్ని శాశ్వతంగా ఉంటాయి. శాశ్వతమైన శాంతి, ప్రశాంతత కోసం నేను ప్రార్థిస్తున్నాను. దీన్ని ఎప్పుడైనా.. ఎవరైనా చదవొచ్చు' అని రాసుకొచ్చారు. దర్శకుడు నాగ్ అశ్విన్‌పై అమితాబ్ ప్రశంసలు కురిపించిన సంగతి తెలిసిందే. 'కల్కి'లో విజువల్స్ నమ్మశక్యం కావు. నాగ్‌అశ్విన్ ఈ కథ చెప్పి వెళ్లిన తర్వాత 'ఇతను ఏం తింటున్నాడు. ఇంత గొప్పగా రాశాడు' అని నేను చాలాసేపు ఆలోచించాను' అని అన్నారు.



### తెలుగు ప్రేక్షకులను పలకరించనున్న దీపిక

కల్కి 2898 ఏడీ'తో తెలుగు ప్రేక్షకులను నేరుగా పలకరించబోతున్నారు నటి దీపికా పదుకొణె. కొన్నాళ్ల క్రితమే ఆమె టాలీవుడ్‌లో నటించారుగానీ ఆ సినిమా విడుదలకు నోచుకోలేదు. మోడల్‌గా రాణించే సమయంలోనే ప్రముఖ కంపెనీల యాడ్స్‌లో నటించడంతోపాటు పలు 'ఫ్యాషన్ వీక్స్'లో పాల్గొనేవారు. బికినీ ధరించి, కింగ్ ఫిషర్ క్యాలండర్‌కు పోజులివ్వడం అప్పట్లో హాట్ టాపిక్. సంగీత దర్శకుడు హిమేశ్ రేష్మియాతో కలిసి నటించిన 'నామ్ హై తేరా' మ్యూజిక్ వీడియో శ్రోతల్ని విశేషంగా అలరించింది. ఉపేంద్ర హీరోగా తెరకెక్కిన కన్నడ చిత్రం 'ఐశ్వర్య' (2006)తో హీరోయిన్‌గా తెరంగేట్రం చేశారు. అది తెలుగు హిట్ మూవీ 'మన్మథుడు'కు రీమేక్‌గా రూపొందింది. దీపిక తొలి బాలీవుడ్ సినిమా 'ఓం శాంతి ఓం' ఆమె జీవితాన్ని మలుపు తిప్పింది. షారుక్ ఖాన్‌-దీపికలను 'సూపర్ హిట్ జోడీ' అని పిలవడం ఆ చిత్రంతోనే ఆరంభమైంది 'హీరోయిన్' పాత్రలో ఒదిగిపోయేందుకు దీపిక పడిన శ్రమ వృథా పోలేదు. ఉత్తమ నటిగా ఫిల్మ్‌ఫేర్ అవార్డు అందుకున్నారు. ఆ తర్వాత, ఇదే కాంబినేషన్‌లో వచ్చిన 'చెన్నై ఎక్స్‌ప్రెస్', 'హ్యాపీ న్యూ ఇయర్', 'పఠాన్' సైతం మంచి విజయాల్ని అందుకున్నాయి. 'బాజీరావు మస్తానీ', 'పద్మావత్' వంటి హిస్టారికల్ మూవీస్ ఆమెను బాలీవుడ్‌లో ప్రత్యేకంగా నిలిపాయి. 'ఛపాక్' విమర్శకుల ప్రశంసలు అందుకుంది. అగ్ర నటుల సరసన నటించినా.. కథ నచ్చితే యంగ్ హీరోలతో ఆడిపాడేందుకూ ముందుంటానని 'చెప్పకనే చెప్పారు. 'ధమ్ మారో ధమ్', 'బాంబే టాకీస్'లాంటి సినిమాల్లోని ప్రత్యేక గీతాలతోనూ ఉర్రూతలూగించారు. ఆంగ్ల చిత్రాలులతో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు.

### కల్కి విడుదల రోజు రికార్డు

హైదరాబాద్‌లో చాలా వరకు మల్టీప్లెక్స్ ఎక్కువ మొత్తంలో షోలు రన్ చేయబోతున్నాయి. కొత్తగా ఓపెన్ చేసిన అపర్ణ సినిమాస్ మల్టీప్లెక్స్ ఓపెనింగ్ డేనే 42 షోలు ఏర్పాటు చేసింది. ఈ అన్ని షోలకు టికెట్లు అమ్ముడుపోవడంతో అరుదైన రికార్డు నమోదు చేసింది. ఇక రానున్న రోజుల్లో ఎలాంటి ఈ చిత్రం ఎలాంటి రికార్డులు క్రియేట్ చేస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. కల్కి 2898 ఏడీ మిడ్ వీక్‌లో విడుదలవుతున్నప్పటికీ బుకింగ్స్ షురూ చేసిన కొన్ని గంటలకే నేషనల్ బెల్ట్‌లో హిందీ వెర్షన్ టిక్కెట్స్ సుమారు 13 వేలకుపైగా అమ్ముడయ్యాయని ఇప్పటికే స్టన్నింగ్ వార్త బయటకు వచ్చింది. ఇక కల్కి 2898 ఏడీ అడ్వాన్స్ సేల్స్ ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటికే రూ.50 కోట్లు దాటి టాక్ ఆఫ్ ది గ్లోబల్ ఇండస్ట్రీగ్రా నిలిచింది. సైన్స్ ఫిక్షన్ జోనర్‌లో వస్తోన్న ఈ ప్రాజెక్ట్‌ను వైజయంతీ మూవీస్ తెరకెక్కిస్తోంది. ఈ మూవీలో బాలీవుడ్ భామలు దీపికా పదుకొనే, దిశా పటానీ ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తుండగా? బెంగాలీ నటుడు శాశ్వత ఛటర్జీ విలన్‌గా నటిస్తున్నాడు. లెజెండరీ యాక్టర్లు అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, రాజేంద్రప్రసాద్, పశుపతి ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు.





# పెళ్లి ప్రచారాలకు నివేదా చెక్

## కొత్త సినిమా అంటూ.. వివరణ

నివేదా థామస్ పెళ్లి చేసుకోనున్నారంటూ వచ్చిన వార్తలకు చెక్ పడింది. సస్పెన్స్‌కు తెరదించింది. కొత్త చిత్రాన్ని ప్రకటించి రూమర్స్‌పై క్లారిటీ ఇచ్చారు. 'జెంటిల్ మేన్'తో తెలుగు తెరకు పరిచయమై తన నటనతో ఎందరో అభిమానులను సొంతం చేసుకున్న నివేదా ఇటీవల తన ఇన్‌స్టా స్టోరీలో 'ఎన్నో రోజుల తర్వాత.. ఫైనల్లీ' అని రాశారు. దీనికి లవ్ సింబల్‌ను జోడించారు. దీంతో ఈ హీరోయిన్ పెళ్లి పీటలెక్కనుందని జోరుగా ప్రచారం జరిగింది. తాజాగా ఆ రూమర్స్‌కు చెక్ పెడుతూ 'చాలా రోజులు వేచి చూశారు. ఇది నా స్పెషల్ ఫిల్మ్' అని కొత్త సినిమాను ప్రకటించారు. దీంతో ఆమె పెట్టిన స్టేటస్ పెళ్లి గురించి కాదని.. కొత్త సినిమా గురించేనని క్లారిటీ వచ్చింది. ఇక ఈ చిత్రాన్ని నటుడు రానా నిర్మించడం మరో విశేషం. '35 – ఇది చిన్న కథ కాదు' అనే ఆసక్తికర టైటిల్‌తో తెరకెక్కనుంది. ఈ సినిమా పోస్టర్‌ను రానా ఎక్స్ వేదికగా పంచుకున్నారు. తిరుపతి నేపథ్యంలో జరిగే కథ అని.. అందరి హృదయాలను హత్తుకుంటుందని ఆయన తెలిపారు. ఆగస్టు 15న ప్రేక్షకుల ముందుకురానున్నట్లు చెప్పారు. ఈ చిత్రంతో నందకిశోర్ అనే కొత్త దర్శకుడు ఇండస్ట్రీకి పరిచయం కానున్నారు. ప్రియదర్శి, నివేదా థామస్ జంటగా నటిస్తుండగా సీనియర్ నటి గౌతమి ఇందులో కీలకపాత్రలో కనిపించనున్నారు. దీనికి సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలోనే ప్రకటించనున్నారు.



# విధుల్లో అలసత్వం వద్దు

## అదనపు డీసీపీ సురేష్ కుమార్

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వ్యక్తిగత భద్రతా సిబ్బంది తమకు అప్పగించిన విధుల్లో అలసత్వం వహించవద్దని అదనపు డీసీపీ సురేష్ కుమార్ తెలియజేసారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన వ్యక్తిగత భద్రతా సిబ్బందికి మంగళవారం ఒక రోజు శిక్షణ తరగతులను కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించారు. రాష్ట్ర సెక్యూరిటీ వింగ్ ప్రధాన కార్యాలయానికి చెందిన వరంగల్ పోలీస్ కమిషనరేట్ పర్సనల్ సెక్యూరిటీ వింగ్ ఇంచార్జి డీఎస్పీ నర్సిరెడ్డి అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిక్షణ తరగతుల్లో వ్యక్తిగత భద్రతా సిబ్బందితో పాటు బాంబు నిర్వీర్యం విభాగం సిబ్బంది పాల్గొన్నారు. పీఎస్ఓ భద్రత కల్పిస్తున్న వ్యక్తులను శత్రువుల నుంచి ఎలాంటి ప్రాణాపాయం లేకుండా సురక్షితంగా పరిరక్షించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపై సంబంధిత విభాగం అధికారులు వ్యక్తిగత భద్రతా సిబ్బందికి వివరించారు. ఈ సందర్భంగా అదనపు డీసీపీ మాట్లాడుతూ వ్యక్తిగత భద్రతా సిబ్బందిగా విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంటుందని, శత్రువులకు ఎలాంటి అవకాశం కల్పించినా భారీమూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చిరించారు. ఇలాంటి ప్రమాదాల నివారణకై వ్యక్తి భద్రతా సిబ్బంది ప్రత్యేక శిక్షణ అవసరమన్నారు. వీఐపీ భద్రత కల్పిస్తున్న సమయంలో అనుక్షణం పరిసరాలను పరిశీలించడంతో పాటు, వేగంగా అనుమానస్పద వ్యక్తులను గుర్తించాల్సి ఉంటుందన్నారు. వీఐపీ ప్రజల మధ్య సంచరించే సమయంలో ఏ విధమైన ప్రమాదం జరుగుతుందో ముందస్తు అంచనా వేసుకోవాలన్నారు. భద్రతా సిబ్బంది అప్రమత్తంగా ఉంటే వీఐపీలకు ఎలాంటి ప్రమాదం ఉండదన్నారు. అలాగే భద్రతా సిబ్బంది అన్ని రకాల ఆయుధాలను వినియోగించడంలో నిష్ణాతుల్కైన ఉండాలని, వీటితో పాటు దేహదారుద్యంగా, మానసికంగా ధృడంగా ఉండాలని, ఆరోగ్య పరిరక్షణ కోసం భద్రతా సిబ్బంది నిరంతరం యోగ లేదా శారీరక వ్యాయామం చేయడం మంచిదని అదనపు డీసీపీ సూచించారు. ఈ కార్యక్రమములో అదనపు డీసీపీలు, ఆర్ఐలు స్పర్జన్ రాజ్, శ్రీనివాస్, శ్రీధర్, పోలీస్ సంఘం అధ్యక్షుడు శోభన్ గౌడ్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

# చెత్తతో నిండుకున్న బాక్స్ డ్రైన్

## తొలగించిన కార్పొరేటర్




**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** అండర్ రైల్వే గేట్ ప్రాంతం 40వ డివిజన్ పరిధిలోని బాక్స్ డ్రైన్ లు చెత్తతో నిండుకున్నాయని స్థానిక కార్పొరేటర్ మరుపల్ల రవి ఆరోపించారు. గతంలో వర్షాకాలానికి ముందే బాక్స్ డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్త, చెదారం తొలగించేందుకు బల్దియా ఇంజనీరింగ్ అధికారులు ప్రణాళికలు రూపొందించి చర్యలు చేపట్టేవారని, ప్రస్తుతం అటువంటి ప్రణాళికలు కానరావడం లేదని ఆరోపించారు. బాక్స్ డ్రైన్ లు నిండిపోవడంతో తేలిక పాటి వర్షానికి కూడా లోతట్టు ప్రాంతాలన్నీ జలమయంగా మారుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని అనేక మార్లు మేయర్ దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోవడం లేదన్నారు. డివిజన్ లోని మంకీ ఫుడ్ కోర్ట్, ఉర్సు హిందూ శ్మశాన వాటిక, కరీమాబాద్ ఆంజనేయ స్వామి దేవాలయం వెనుక వైపు కేవలం చెత్తాచెదారం తొలగించడం జరిగిందని ఇంకా మట్టి అలాగే పేరుకుపోయి ఉందన్నారు. బల్దియా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టి బాక్స్ డ్రైన్ లో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ వెంకన్న జవాన్ ప్రశాంత్, స్థానికులు వీర మల్లయ్య, అశోక్, మల్లయ్య, జ్యోతి తదితరులు ఉన్నారు.

# ‘మహిళా శక్తి’ని సమర్ధవంతంగా అమలు చేయాలి

## జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా




**వరంగల్ వాయిస్, వరంగల్ :** ‘మహిళా శక్తి’ పథకాన్ని జిల్లాలో సమర్ధవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా అధికారులను ఆదేశించారు.మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశం మందిరంలో సెర్ప్, స్త్రీనిధి సిబ్బందికి మహిళా శక్తి కార్యక్రమం అమలుపై జరిగిన అవగాహన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..రాష్ట్రంలోని మహిళా స్వయం సహాయక సభ్యులకు మరింత చేయూత ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ మహిళా శక్తి పథకాన్ని అమలు చేస్తుందన్నారు. ఈ పథకం కింద గ్రామ సమాఖ్యలోని సంఘాలకు కోటి రూపాయల వరకు వడ్డీ లేని రుణాలను అందజేయడంతో పాటు, ఎస్ హెచ్ జి మహిళలకు ఐదు లక్షల రూపాయల వరకు బీమా సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. మహిళలకు ఆర్థికంగా శక్తిమంతులను చేసి వారిని కోటీశ్వరులను చేయడమే మహిళా శక్తి పథకం ముఖ్య ఉద్దేశమని, ఈ పథకాన్ని జిల్లాలో దిగ్విజయంగా నెరవేర్చాలని సూచించారు. స్వయం సహాయ సంఘాల ద్వారా పలు రకాల సూక్ష్మ పరిశ్రమలు, వ్యాపారాలను ప్రోత్సహించి సంఘాలలో సభ్యులుగా ఉన్న మహిళల ఆర్థిక స్వావలంబనకు సహకరించడం, మహిళల సామాజిక భద్రత కోణంలో సంఘాలను బలోపేతం చేయడం మహిళా శక్తి పథకం ప్రధాన ఉద్దేశాలని అన్నారు. సూక్ష్మ తరహా పరిశ్రమలను గుర్తించి, అందులో సంఘాలను ప్రోత్సహించడం, ఆయా సంఘాలలో మహిళలు తమ నైపుణ్యాలకు తగ్గ ఉత్పత్తులను ఎంచుకుని, ఆ ఉత్పత్తులకు అవసరమైన నైపుణ్యాన్ని అందించడం, ఉత్పత్తికి అవసరమైన ఆర్థిక సహకారం కోసం బ్యాంక్ లింకేజీల సదుపాయం కల్పించడం, ఉత్పత్తి అయిన సరుకులు మార్కెటింగ్ కు అవసరమైన ప్రణాళికలు, సహకారం అందివ్వడం మహిళాశక్తి పథకంలో భాగమని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కౌసల్యాదేవి, అదనపు డిఆర్డీఓ రేణుక, జిల్లా పరిశ్రమల అధికారి నర్సింహ మూర్తి, ఎన్పిడిసిఎల్ ఎస్ఈ మధుసూదన్ రావు, ఈడీ ఎం రాజ్కుమార్, డైరీ, పశు సంవర్ధక శాఖ, డిపి ఎం, ఎస్బిఐ, ఫుడ్ సేఫ్టీ, రెడ్కో, కృషి విజ్ఞాన కేంద్ర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# ఫైనల్‌కు చేరిన కెమెరా మెన్స్-XI, యంగ్ ఎలక్ట్రానిక్ మీడియా జట్లు

## బుధవారం ఫైనల్ మ్యాచ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్-మీట్ 2024 లో భాగంగా నిర్వహించిన క్రికెట్ పోటీలో కెమెరామెన్స్-XI,యంగ్ ఎలక్ట్రానిక్ మీడియా జట్లు ఫైనల్ చేరుకున్నాయి. వర్షం కారణంగా వారం రోజుల విరామం అనంతరం మంగళవారం క్రికెట్ పోటీలు తిరిగి ప్రారంభమయ్యాయి. ఈరోజు కెమెరా మెన్స్-XI, హన్మకొండ కింగ్స్ జట్ల మధ్య సెమీ ఫైనల్ మ్యాచ్ జరుగగా కెమెరా మెన్స్-XI జట్టు విజయం సాధించింది. గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, కోశాధికారి బోల్ల అమర్ ల ఆధ్వర్యంలో క్రీడాకారుల పరిచయ కార్యక్రమం అనంతరం టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కెమెరామెన్స్-XI జట్టు 12 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 118 పరుగులు చేసింది. వెంకటేశ్వరరావు 41 పరుగులు సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన హనుమకొండ కింగ్స్ జట్టు 12 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 56 పరుగులకే పరిమితమైంది. దీంతో కెమెరామెన్స్ XI జట్టు 62 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు గోకరపు శ్యాం, బొడిగె శ్రీను, అల్లం రాజేశ్ వర్మ, యంసాని శ్రీనివాస్, జాయింట్ సెక్రెటరీలు వలిశెట్టి సుధాకర్, బూర్ల నరేందర్, ఈసీ మెంబర్లు మంచాల రాజు, భరత్, దిలీప్, శ్రీకాంత్, నయీంపాషా, స్టాఫ్ రిపోర్టర్లు, బ్యూరోలు, జర్నలిస్టులు, కెమెరామెన్లు పాల్గొన్నారు.

### రేపు ఫైనల్ మ్యాచ్..

హనుమకొండలోని ఆర్ట్ కళాశాల మైదానంలో బుధవారం ఉదయం 7.30 గంటలకు కెమెరామెన్స్-XI జట్టు, యంగ్ ఎలక్ట్రానిక్ మీడియా జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరగనుంది. ఫైనల్ మ్యాచ్ తిలకించేందుకు జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని ప్రెస్ క్లబ్ బాధ్యులు కోరారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com